క్లుప్తంగా

నష్టపరిహారం చెల్లించాలి

ఖమ్మంరూరల్: వైరస్, వేరు కుళ్లు తెగుళ్లతో దెబ్బతిన్న మిర్చి పంటకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు తెలిపారు. శనివారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 31న ఖమ్మంలో జరిగే రైతు మహాధర్నాను జయప్రదం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు వరప్రసాద్, జి.నాగేశ్వర రావు, బి.సత్యనారాయణ, డి.వెంకటయ్య, వి.సుదర్శన్‌రెడ్డి, రామయ్య పాల్గొన్నారు.

పొంగులేటిని కలిసిన కార్పొరేటర్లు

ఖమ్మంఅర్బన్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని శనివారం నగరంలోని 3, 7వ డివిజన్ల కార్పొరేటర్లు మల్లీదు జగన్‌మోహన్ రావు, దొంగల సత్యనారాయణలు కలిశారు. బీజేపీ నుంచి గెలిచిన కార్పొరేటర్ సత్యనారాయణ పొంగులేటిని తమ పార్టీలోకి రావాలని కోరినట్లు సత్యనారాయణ తెలిపారు. వారిలో పాటు పలువురు నాయకులు అరుణ తదితరులు ఉన్నారు.

ఇసుక లారీల పట్టివేత

నేలకొండపల్లి: ఏపీ నుంచి అక్రమంగా తరలుతున్న ఇసుక లారీలను శనివారం తెల్లవారు జామున నేలకొండపల్లి పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని జగ్గయ్యపేట నుంచి ఏడు లారీలు ఇసుక లోడుతో హైదరాబాద్ వెళ్తున్నాయి. విషయం తెలుసుకున్న నేలకొండపల్లి ఎస్‌ఐ జి.స్రవంతి సిబ్బందితో వెళ్లి మండలంలోని చెరువుమాధారం క్రాస్‌రోడ్డు వద్ద మాటువేసి పట్టుకున్నారు. లారీల వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవటంతో స్వాధీనం చేసుకుని మైనింగ్ అధికా రులకు అప్పగించారు. మైనింగ్ అధికారులు కేసు నమోదు చేసి లారీలకు జరిమానా విధించారు.

తహసీల్దార్‌కు వినతి

నేలకొండపల్లి: సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టాన్ని అమలు చేయాలని అఖిల భారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండెల వెంకయ్య డిమాండ్ చేశారు. శనావారం సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ దారా ప్రసాద్‌కు వినతి పత్రం అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పగిడికత్తుల వెంకటేశ్వర్లు, నాగేశ్వర రావు, సీవై పుల్లయ్య, పి.రామదాసు, గాదె నరసింహరావు, ఎం.విజయ్ పాల్గొన్నారు.

వైభవంగా మహా పడిపూజ



పూజలు చేస్తున్న సర్పంచ్ రాధాకృష్ణ దంపతులు

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరు పంచాయతీలో పెనుగ్రంచిప్రోలు శ్రీలక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి మహాపడి పూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మాలధారణ భక్తుల ఆధ్వర్యంలో ఈ మహాపడి పూజ ఏర్పాటు చేయగా.. ఆలయ ప్రధాన అర్చకుడు రమణగురుస్వామి పూజలు జేశారు. గ్రామ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ దంపతులు ప్రత్యేక పూజను నిర్వహించారు. స్వాములు ఆట, పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

కూసుమంచి: కూసుమంచి ఉన్నత పాఠశాలలోని గ్రంథాలయానికి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు కేవైవీ రంగారావు జ్ఞాపకార్థం శనివారం ఆయన కుమారుడు లక్ష్మీనర్సింహారావు రూ.10వేల విలువైన పుస్తకాలను వితరణ చేశారు. అనంతరం దాతకు పాఠశాల హెచ్‌ఎం విక్రమ్‌రెడ్డి, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రథసప్తమి వేడుకలు

ఖమ్మంగాంధీచౌక్: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో శనివారం పలు పాఠశాలల్లో రథసప్తమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య హృదయం, అష్టోత్తర పారాయణంతో పాటు సూర్య నమస్కారాలు వంటి కార్యక్రమాలను విద్యార్థులతో చేయించారు. రథ సప్తమి వేడుకలను ఖమ్మం హిందూ ధర్మాప్రచార పరిషత్ కో–ఆర్డినేటర్ కర్నాటి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. యోగా గురువులు చంద్రశేఖర్, ధార్మికోపన్యాసకులు, భువన విజయం అధ్యక్షుడు వెంకటరాణా ప్రతాప్ పాల్గొన్నారు.

బస్‌పాస్‌ల పంపిణీ

ఖమ్మం మామిళ్లగూడెం: దివ్యాంగులకు టీఎస్‌ఆర్టీసీ రాయితీపాస్‌ల సౌకర్యం కల్పించినట్లు ఖమ్మం డీఎం శ్రీనివారావు తెలిపారు. శనివారం మంచుకొండకు చెందిన 100 మంది దివ్యాంగులకు రాయితీ పాస్‌లు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ సంస్థ 'ప్రజల వద్దకు ఆర్టీసీ'కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో దివ్యాంగులు మంచుకొండ బస్టాప్‌లో బస్సులు ఆపేలా చూడాలని కోరారు. ఖమ్మం నూతన బస్టాండ్ మేనేజర్ రఘుబాబు, విజయ, మధు, మహిళలు, దివ్యాంగులు పాల్గొన్నారు.

బతుకుదెరువుకు 'బారదాన్'..!

ఖాళీ బస్తాల తయారీ, విక్రయాలతో ఉపాధి
- పంట సీజన్‌లో జోరుగా పనులు
- ఉత్పత్తులకు అనుగుణంగా తయారీ
- సైజు, నాణ్యతను బట్టి ధర
- వందలాది కుటుంబాలకు జీవనాధారం



విక్రయానికి సిద్ధంగా ఉన్న గన్నీ, ప్లాస్టిక్ బస్తాలు

చింపిరి బస్తాలే కొందరికి ఆకలి తీరుస్తూ.. బతుకుదెరువుకు ఆధారాన్నిస్తున్నాయి. మిల్లులు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, మార్కెట్లు, గోదాముల వద్ద చిరిగిపోయిన, పడేసిన గన్నీ(బారదాన్) బస్తాలు, ప్లాస్టిక్ బస్తాలను సేకరించి తిరిగి వాటిని ప్రయోజనకరంగా మార్చి పలు కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. రైతుల పంటలకు అనుగుణంగా వివిధ సైజుల్లో బస్తాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. స్థానికులతో పాటు విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాలకు చెందిన వారు కూడా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఖాళీ బస్తాల తయారీ, విక్రయాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్, నగరంలోని రైస్ మిల్లులు, దాల్ మిల్లులు, జిన్నింగ్ మిల్లులు, వివిధ పరిశ్రమల ఆధారంగా ఖాళీ బస్తాలను తయారు చేసి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 500 కుటుంబాలు గన్నీ బస్తాలు, ప్లాస్టిక్ బస్తాల తయారీ విక్రయంపై ఆధారపడి బతుకుతున్నాయి. ఖాళీ బస్తాలను పరిశ్రమలు, మిల్లులు, మార్కెట్ల నుంచి తీసుకురావటం, చిరిగిపోయిన బస్తాలను కట్ చేసి తిరిగి ప్రయోజనకం కలిగే విధంగా మార్చి కుట్టడం వంటి పనులు చేస్తున్నారు. చేపల చెరువులు, గోదాములు, రైతుల నుంచి ఎరువుల ఖాళీ బస్తాలను సేకరించి వివిధ సైజుల్లో బస్తాలను తయారు చేస్తున్నారు.

రైతులకు ఉపయోగపడేలా..

రైతులు పంట ఉత్పత్తులకు అనుగుణంగా స్థానిక మార్కెట్లు, మిల్లుల్లో వినియోగించుకునేందుకు అనువుగా బస్తాలను తయారు చేస్తున్నారు. ఇక్కడ ప్రధానంగా పండించే పత్తి, మిర్చి ధాన్యం, మొక్కజొన్న అపరాల పంటలను విక్రయించుకునే విధంగా లేదా నిల్వ ఉంచుకునే విధంగా తయారు చేస్తున్నారు. పత్తి, మిర్చి పంటలు 30 నుంచి 50 కిలోల వరకు పట్టే విధంగా గన్నీ బస్తాలను తయారు చేసి ఒక్కో గన్నీ బస్తాను నాణ్యతను బట్టి రూ. 45 నుంచి రూ. 50ల వరకు విక్రయిస్తున్నారు. ఇక ధాన్యం నింపుకునేందుకు 70 నుంచి 77 కిలోల వరకు పట్టే ప్లాస్టిక్ బస్తాలను తయారు చేసి రూ. 15 నుంచి రూ. 20ల వరకు విక్రయిస్తున్నారు. ఇక వీటితో పాటు ప్లాస్టిక్ సంచులతో ధాన్యం, మిర్చి, పత్తి అపరాల పంటలను ఆరబెట్టుకునేందుకు పట్టాలు(టార్పాలిన్లు) తయారు చేసి సైజును బట్టి ధరను నిర్ణయించి విక్రయిస్తున్నారు.

పంట సీజన్‌లో మరింత పనులు..

పంటల సీజన్‌లోనే బస్తాలు తయారు చేసే రంగం ద్వారా పనులు లభిస్తున్నాయి. పంటలు చేతికందే



గన్నీ బస్తాలను కుడుతున్న కూలీలు

దసరా(అక్టోబర్) పండుగ నుంచి మార్చి వరకు ఖాళీ బస్తాల తయారీ, విక్రయ పనులు జరుగుతుంటాయి. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు వివిధ ప్రాంతాలు, పరిశ్రమలు, మార్కెట్లు, గోదాముల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ సంచులు, గన్నీ బస్తాలను సమీకరించుకుంటారు. పలుచోట్ల తయారీదారులు బస్తాల నాణ్యతలను బట్టి ధర చెల్లించి కొనుగోలు చేసి తమ ఖార్కానాల్లో వేసవి కాలంలో బస్తాలను తయారు చేసి విక్రయానికి సిద్ధం చేస్తుంటారు.

తయారీ, విక్రయాలతోనే ఉపాధి..

వివిధ సైజుల్లో బస్తాలను తయారు చేసి కొందరు వ్యాపారంగా విక్రయిస్తూ ఉపాధి పొందుతుండగా, మరికొందరు విక్రయదారుల వద్ద కూలీలుగా ఉపాధి పొందుతున్నారు. బస్తాల సేకరణ, తయారీకి పెట్టుబడి పెట్టే వారు నిత్యం సీజన్, వ్యాపారాన్ని బట్టి రూ. 600 నుంచి రూ. 1000ల వరకు పొందుతుండగా, వారి వద్ద పనిచేసే కూలీలు తయారు చేసే బస్తాల సంఖ్య, కుట్టే నైపుణ్యాన్ని బట్టి రూ. 400 నుంచి రూ. 600ల వరకు కూలీ పొందుతున్నారు.

50 ఏళ్లుగా చేస్తున్నాం..



విజయవాడలో ఖాళీ బస్తాలు తయారు చేయటం నేర్చుకున్నా. బతుకుదెరువు కోసం ఖమ్మం వచ్చా. వ్యవసాయ మార్కెట్ ఆధారంగా గన్నీ బస్తాలను సేకరించి పత్తి, మిర్చి పంటలకు అనుగుణంగా తయారు చేసి విక్రయిస్తున్నాం. దీనిపైనే నా కుటుంబం ఆధారపడి బతుకుతున్నాం.

– బెవర అనంతరావు, ఖాళీ బస్తాల విక్రయదారుడు, ఖమ్మం

సీజన్‌లోనే పనులు..



పంట ఉత్పత్తుల సీజన్‌లో ఖాళీ బస్తాల తయారీ, విక్రయం బాగానే ఉంటుంది. వేసవిలో పనులు, విక్రయాలు ఉండక పోవడంతో కొన్ని సార్లు ఇబ్బంది పడుతున్నాం. విక్రయదారుల పోటీ పెరగడంతో ఒక్కోసారి రోజుకూలీ గిట్టడం కష్టమవుతుంది. ఖాళీ బస్తాల తయారీతోనే జీవనం సాగుతోంది.

– దేవవరపు గణేష్, ఖాళీ బస్తాల తయారీ, విక్రయదారుడు, ఖమ్మం

పంటలు పండితేనే వ్యాపారం..



రైతులకు పంటలు పండితే మా వ్యాపారం బాగుంటుంది. ఒక వేళ కరువు చోటు చేసుకుంటే రైతుల మాదిరిగా మాకు కష్టాలు తప్పవు. ఇటీవల కాలంలో ప్రభుత్వ కొనుగోళ్లు జరుగుతుండటంతో ఖాళీ బస్తాల వ్యాపారంపై ప్రభావం పడుతుంది. దీంతో గన్నీ బస్తాల వ్యాపారం ఆశించినస్థాయిలో జరగడం లేదు.

– భాస్కర్, ఖాళీ బస్తాల విక్రయదారుడు, ఖమ్మం

ఇస్లావత్‌తండాకు భక్తరామదాసు నీరు



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కందాల

తిరుమలాయపాలెం: మండలంలోని ఇస్లావత్‌తండా వద్ద భక్తరామదాసు ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు ఏర్పాటు చేసినా.. గ్రామానికి సాగునీరు అందడం లేదని ఇటీవల రైతులు పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డికి విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే సాగునీరు అందించాలని ఇరిగేషన్ డీఈ రమేష్‌రెడ్డిని ఆదేశించగా.. నీళ్ల విడుదల చేసేందుకు భక్తరామదాసు పైపులైన్‌కు గేట్‌వాల్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే నీళ్లను విడుదల చేయడంతో తండా పరిధిలోని 200 ఎకరాలకు సాగునీరు అందుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సీఈ శంకర్‌నాయక్, ఎస్‌ఈ వెంకటేశ్వరరావు, డీఈ భాణాల రమేష్‌రెడ్డి ఎంపీపీ మంగీలాల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా మంత్రి పువ్వాడ

రఘునాథపాలెం: మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన తెలూరి రమేష్ ఇటీవల జరిగిన ఘర్షణలో గాయలుపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. రమేష్ మృతిదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పీఏ రవికిరణ్ సందర్శించి నివాళుర్పించారు. అనంతరం మృతుడి కుటుంబానికి మంత్రి పువ్వాడ ఫౌండేషన్ ద్వారా అందించిన రూ.10 వేల ఆర్థికసాయమందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొంటిముక్కల వెంకటేశ్వర్లు, నాయకులు సంగయ్య, ఆదాం, రాంబాబు, కిరణ్, వీరబాబు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు పారదర్శకంగా ఉండాలి

ఖమ్మంసహకారనగర్: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని శనివారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అక్రమ బదిలీలను నిలిపివేయాలని, ఉపాధ్యాయులందరికీ వారి స్టేషన్ సీనియారిటీతో సంబంధం లేకుండా బదిలీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌పీసీ రాష్ట్ర నాయకులు పి.నాగిరెడ్డి, షేక్ మహబూబ్‌అలీ, జిల్లా నాయకులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వర రావు, ఎస్.విజయ్, జి.యాదగిరి, మన్సూర్, బుర్రా వెంకన్న, మంగ్యానాయక్, హుస్సేన్, షమీ, రాంబాబు, ప్రసాదరావు, మల్లయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు వినతి..

బదిలీల్లో గిరిజన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్(టీఎస్‌టీటీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం రాత్రి డీఈఓ సోమశేఖర శర్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భుక్యా మంగ్యానాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు జీరో సర్వీస్ బదిలీలు కల్పించాలని, దివ్యాంగులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాపాలాల్ నాయక్, నాయకులు కిషన్ రాథోడ్, సీతారాములు, రమేష్ నాయక్, జగ్గిలాల్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాచౌక్‌లో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

'మిలీనియం'లో ఎకనాలెడ్జ్ ఫెయిర్



ప్రదర్శనలను తిలకిస్తున్న సుడా చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని మిలీనియం హైస్కూల్‌లో ఎకనాలెడ్జ్ ఫెయిర్–2023ను శనివారం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ జాహెద్‌అలీ తెలిపారు. కార్యక్రమానికి సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, సిటీ లైబ్రరీ చైర్మన్ ఆశ్రీఫ్, బీఆర్‌ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మంత్రి పీఏ కిరణ్‌కుమార్‌లు పాల్గొని మాట్లాడారు. ఎకనాలెడ్జ్ ఫెయిర్‌లో విద్యార్థులు వివిధ ప్రదర్శనలు ప్రదర్శించడం అభినందనీయమన్నారు.ఈ ప్రదర్శనలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, బతకమ్మలు ప్రదర్శించగా అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'విన్‌ఫీల్డ్'లో కల్చరల్ ఫెస్ట్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఈఓ సోమశేఖర శర్మ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని విన్‌ఫీల్డ్ హైస్కూల్‌లో కల్చరల్ ఫెస్ట్–2023ను శనివారం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల యజమాన్యం గద్దె పుల్లారావు, పోలవరపు శ్రీకాంత్, మన్నె కిషోర్ కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ సోమశేఖరశర్మ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలోని వివిధ రాష్ట్రాల పండుగలు, వారి వేషధారణ, ఆహారపు అలవాట్లను తెలిపేలా ఫెస్ట్‌ను నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్చరీ టోర్నీలో 'హార్వెస్ట్' విద్యార్థిని ప్రతిభ

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని హార్వెస్ట్ పబ్లిక్ పాఠశాలకు చెందిన ఎస్‌కె.హాస్న సీబీఎస్‌ఈ ఆర్చరీ పోటీల్లో ప్రతిభ చాటుకుని కాంస్య పతకం దక్కించుకుంది. తొలుత అండర్–14 విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచడంతో మహారాష్ట్రలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఇండియాన్ రౌండ్‌లో కాంస్య పతకం దక్కించుకుంది. దీంతో పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డిలు హాస్నను అభినందించారు.

'ప్రియదర్శిని'లో సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ ఇంద్రకుమార్

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థినులకు కమ్యూనికేషన్ సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్ ట్రైనర్ ఇంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రతీ ఏటా కళాశాలలో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కె.నవీన్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, అధ్యాపకులు, హెచ్‌ఓడీలు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన వైద్య శిబిరం

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. కాగా, రెండో రోజైన శనివారం కూడా విద్యాలయంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్, సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థులను పరీక్షించి మందులు అందజేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఆదివారం కూడా క్యాంపును కొనసాగిస్తామని మెడికల్ ఆఫీసర్ తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి 'ఆయుష్మాన్ భారత్'

కూసుమంచి: కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్మిక శాఖ సహాయ కమిషనర్ సీహెచ్.వెంగమ్మ కోరారు. శనివారం మండలంలోని నేలపట్ల గ్రామంలో పలువురు కార్మికులతో ఆమె మాట్లాడారు. ఈ పథకంలో చేరి బీమా పొందటం వలన కార్మికుల కుటుంబాలకు భరోసా లభిస్తుందన్నారు. ఈ– శ్రమ్ కార్డుల ప్రత్యేకత, అవి పొందే విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెంటాల ధనమ్మ, బీజేపీ మండల కార్యదర్శి దామళ్ల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.


నియామకం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్, టౌన్ బీజేపీ మైనార్టీ మోర్చా అర్బన్ అధ్యక్షుడిగా పఠాన్ ఫకృద్దీన్ నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ అర్బన్ టౌన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాసరావు నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫకృద్దీన్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ యాకూబ్ పాషా, జిల్లా మైనార్టీ మోర్చా ప్రభారి నున్నా రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల సుధాకర్, బోయినపల్లి చంద్రశేఖర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు టేకుమట్ల వీరు గౌడ్, జిల్లా యువమోర్చా ప్రధాన కార్యదర్శి ఈదుల భద్రం, జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా హుస్సేన్

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ మైనార్టీ మోర్చా త్రీటౌన్ అధ్యక్షుడిగా షేక్.హుస్సేన్ నియమితులయ్యారు. శనివారం బీజేపీ త్రీటౌన్ అధ్యక్షుడు కొనతం లక్ష్మీనారాయణగుప్త ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ మోర్చా ప్రభారి నున్నా రవికుమార్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల సుధాకర్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాకుబ్ పాషా, బోయినపల్లి చంద్రశేఖర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు టేకుమట్ల వీరుగౌడ్, ఈదుల భద్రం, త్రీటౌన్ ప్రధాన కార్యదర్శి అంకిత పాపారావు, జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ పైపులైన్ ధ్వంసం



వృథాగా పోతున్న నీరు

కూసుమంచి: మండలంలోని నర్సింహులగూడెం ఫేజ్–1 ఎత్తిపోతల పథకం పైపులైన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం ధ్వంసం చేయటంతో నీరంతా వృథాగా పోతోంది. ఈ లిఫ్ట్ ద్వారా చౌటపల్లి ఊర చెరువుకు నీటిని విడుదల చేయగా.. గైగోళ్లపల్లి రోడ్ సమీపంలో పైపులైన్‌ను ధ్వంసం చేయటంతో నీరు చేలల్లో వృథాగా పారుతోంది. ఈ విషయమై నీటిపారుదల శాఖ డీఈఈ రమేష్‌రెడ్డిని వివరణ కోరగా.. మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

సంక్షేమ ఫలాల కోసం ఉద్యమించాలి

నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: భవన నిర్మాణ కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన సంక్షేమ ఫలాల కోసం కార్మికులందరూ ఉద్యమించాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను తక్షణమే పరిష్కరించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోసు పుల్ల య్య, మండల అధ్యక్షుడు జనార్దన్‌సింగ్ పిలుపునిచ్చారు. ఖమ్మంరూరల్ మండలంలోని చింతపల్లిలో జరిగిన సమావేశంలో గోసు పుల్లయ్య, నేలకొండపల్లిలో జనార్దన్‌సింగ్‌లు వచ్చే నెల 1వ తేదీన ఖమ్మం కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా పోస్టర్లను శనివారం వారు ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. సీఎం కేసీఆర్ భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు నిండిన కార్మికులకు రూ.5వేల పెన్షన్ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పగిడికత్తుల సాలయ్య, నాగరాజు, పగిడికత్తుల అర్జున్, వెంకటేష్, సైదులు, నరసింహారావు,రాములు, సురేష్, ఎ.రామారావు, ఉప్పలయ్య, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులా పురం గ్రామంలో ఇద్దరు మహిళల మధ్య ఏర్పడిన ఘర్షణ ఇరు వర్గాల వారు పరస్పరం దాడులు చేసుకునే వరకు వెళ్లింది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బొడ్డు భారతమ్మపై అదే గ్రామానికి చెందిన గణపారపు ఉమ శనివారం అకారణంగా దాడి చేసింది. అసభ్య పదజాలంతో దూషించింది. దీంతో తిరిగి ఉమాపై బొడ్డు భారతమ్మ, చంద్రకళ, మామిళ్ల వసంత, ములకలపల్లి యాకమ్మ.. ఇంకా కొందరు కలిసి దాడి చేసి కొట్టారు. ఇరు వర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో ఇరు వర్గాల వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

కేసు నమోదు

నేలకొండపల్లి: మండలంలోని సెంట్రింగ్ షట్టర్స్ చోరీకి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులకు సంబంధించిన సెంట్రింగ్ షట్టర్లు ఇటీవల పలు చోట్ల చోరీకి గురయ్యాయి. పది రోజుల కిందట జాతీయ రహదారి నిర్మాణ సంస్థకు చెందిన ఉద్యోగులు వెంటపడి తరిమినా నిందితులు చిక్కలేదు. ఆ సమయంలో చోరీ గురించి కంపెనీ ప్రతినిధులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాజాగా శనివారం ఓ ఆటోలో ఇరువురు దొంగలు సెంట్రింగ్ షట్టర్స్‌ను చోరీ చేసి తరలిస్తుండగా మండల కేంద్రంలో ఉన్న కంపెనీ ఉద్యోగులు వారిని పట్టుకుని, స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు నేలకొండపల్లి ఎస్‌ఐ జి.స్రవంతి వారిపై కేసు నమోదు చేశారు.

అదనపు చార్జీలు ఉపసంహరించుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులపై ఏసీడీ పేరుతో విద్యుత్ చార్జీల వసూళ్లను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సంక్షేమం పేరు చెప్పి ప్రగల్భాలు పలికే బీఆర్‌ఎస్ ప్రభుత్వం అడ్వాన్స్ పేరుతో వసూళ్లకు పూనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రభుత్వ నష్టాలన్నింటిని పేద ప్రజలపై మోపడానికి కుట్ర చేస్తోందని, దీనికి ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ కూడా వత్తాసు పలుకుతున్నదని పేర్కొన్నారు. ఈ విధానాన్ని పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, వీటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31న రాష్ట్ర వ్యాప్తంగా మండలస్థాయిలో విద్యుత్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో తెలంగాణ రియల్టర్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారగోని ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పగడాల రంగారావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగానికి చట్టపరమైన విధానం తెచ్చేందుకు తెలంగాణ రియల్టర్ అసోసియేషన్ పోరాడుతుందని అన్నారు. గ్రామ పంచాయతీ లేఅవుట్ వెంచర్స్‌కి తక్షణమే రిజిస్ట్రేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అన్వర్ పాషా, పటాన్ జానీల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకపోతుల నర్సయ్య, జిల్లా రియల్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నం వీరప్రసాద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటేపల్లి జనార్దన్‌రావు, జిల్లా రియల్టర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలూరు రాములో పాటు గరికపాటి ఆంజనేయ ప్రసాద్, బిల్లా సతీష్ బాబు, బండి జయకిషోర్ పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే

నేలకొండపల్లి: బీసీలకు 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని సకల జనుల పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్.డీ.ఎల్.రాంబాబు డిమాండ్ చేశారు. బీఎస్పీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శిబిరానికి మద్దతు పలికిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీ జనగణనను ప్రారంభించి బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కోటి సంతకాల సేకరణలో సకల జనుల పార్టీ కూడా పాల్గొంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల నాయకులు బొడ్డు బాబురావు, సకల జనుల పార్టీకి చెందిన పలువురు పాల్గొన్నారు.

ఏసీడీల పేరుతో అదనపు భారం మోపొద్దు

ఏసీడీ చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కమిటీ, సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఆయా మండల్లాలో రాస్తారోకోక, ధర్నా నిర్వహించి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ప్రదర్శకారులు అధికారులకు వినతిపత్రం అందించారు. ఉచిత విద్యుత్ అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31న రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమయూరి సెంటర్: విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు